ఏం చేశారని ప్రజల ముందుకు వెళ్తున్నారు

- వంద రోజుల కూటమి ప్రభుత్వ పాలనలో కక్షపూరిత చర్యలు
- సొంత ప్రయోజనాల కోసం బాబాయ్, అబ్బాయ్‌లు పోర్టుల చుట్టూ తిరుగుతున్నారు
- విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్


సమావేశంలో మాట్లాడుతున్న పేరాడ తిలక్

టెక్కలి: మోసపూరితమైన సూపర్‌సిక్స్ హామీలతో కొన్ని రాజకీయ పార్టీల సాయంతో కూటమి ప్రభుత్వంగా ఏర్పడి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు ఈ వంద రోజుల పాలనలో ఏం మంచి చేశారని 'మంచి ప్రభుత్వం' అంటూ ప్రజల ముంగిటకు వెళ్తున్నారని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ ప్రశ్నించారు. టెక్కలిలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాలు అందజేస్తానని ప్రజల్ని మోసం చేసిన చంద్రబాబు ఈ రోజు వంద రోజుల పాలనలో కేవలం రెడ్‌బుక్ పాలన కొనసాగించి కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డారు తప్పితే ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని మండిపడ్డారు. గత వైఎస్సార్‌సీపీ వంద రోజుల పాలనలో 87 శాతం హామీలను అమలు చేశామని గుర్తు చేశారు. ఒక్క హామీ కూడా అమలు చేయకుండా మంచి ప్రభుత్వం అనే నినాదంతో కూటమి నాయకులు ప్రజల ముంగిటకు వెళ్లడం సిగ్గుచేటుగా లేదా అని దుయ్యబట్టారు. గత వైఎస్సార్‌సీపీ సర్కార్ హయాంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చి 'గడప గడపకూ మన ప్రభుత్వం' పేరుతో ప్రజల ముంగిటకు ధైర్యంగా వెళ్లామని గుర్తు చేశారు. చంద్రబాబు చేసిన మోసాల్ని నిలదీయడానికి కూటమి ప్రభుత్వంలో సహచర పార్టీల నాయకులు ప్రజల ముంగిటకు రావాలన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా అల్లర్లు, దోపిడీలు, మహిళలపై అఘాయిత్యాలు పెచ్చు మీరిపోయి ప్రజా పాలనలో చంద్రబాబు ఘోరంగా వైఫల్యం చెందారని తిలక్ మండిపడ్డారు. ఇటీవల సంభవించిన వరదలో బాధితుల్ని ఆదుకునే విషయంలో చంద్రబాబు ప్రభుత్వం వైఫల్యం చెందడమే కాకుండా విరాళాలు దండుకుంటున్నారని విమర్శించారు. తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, నిరుద్యోగ భృతి, మహిళలకు ఆర్థిక సాయం, మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం, విద్యా దీవెన తదితర పథకాలు ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. ఉచితంగా ఇసుక అని చెప్పి అడ్డదారిలో ఇసుక మాఫియాతో ఖరీదైన వస్తువుగా మార్చేశారని దుయ్యబట్టారు. జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడులు సొంత ప్రయోజనాల కోసం పోర్టుల చుట్టూ తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో తక్కువ రోజుల్లో 75 శాతం పనులు జరిగిన మూలపేట పోర్టును ఇప్పుడు ఎందుకు ఆపించేశారని ప్రశ్నించారు. పోర్టు నిర్మాణం జరిగితే అచ్చెన్న తెర మరుగుకాక తప్పదన్నారు. ఈ వంద రోజుల పాలనలో టెక్కలి నియోజకవర్గంలో చిరుద్యోగస్తులను తొలగించడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి వారి ముంగిటకు వెళ్లాలని హితవు పలికారు. సమావేశంలో టెక్కలి, నందిగాం ఎంపీపీలు ఎ.సరోజనమ్మ, ఎన్.శ్రీరామ్మూర్తి, నాయకులు హెచ్.వెంకటేశ్వరరావు, టి.కిరణ్, బి.రామకృష్ణ, చిన్ని జోగారావు, కె.నారాయణమూర్తి, ఆర్.మురళీరెడ్డి, జి.మోహన్‌రెడ్డి, కె.కామేష్, ఎస్.అప్పలరెడ్డి, ఎ.రాహుల్, డి.కూర్మారావు, చంద్రరావు, బి.రాజేష్‌తో పాటు పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

రూ. 5 కోట్లతో హుద్‌హుద్ ఇళ్లకు మరమ్మతులు

- త్వరలోనే లబ్ధిదారులకు అందజేత
- రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ రాజాబాబు


కోటబొమ్మాళిలోని ఇళ్లను పరిశీలిస్తున్న రాజాబాబు తదితరులు

కోటబొమ్మాళి: టెక్కలి నియోజకవర్గంలో 2014–19 ఆర్థిక సంవత్సరాల్లో నిర్మించిన హుద్‌హుద్ ఇళ్లను ఐదు కోట్ల రూపాయలతో మరమ్మతులు చేపట్టడంతోపాటు మౌలిక వసతులు కల్పించనున్నట్లు రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. మరమ్మతులతోపాటు రోడ్లు, మంచినీటి సౌకర్యం తదితర పనులు పూర్తి చేసి త్వరలోనే లబ్ధిదారులకు అందజేయనున్నట్లు వెల్లడించారు. కోటబొమ్మాళి, టెక్కలి, సంతబొమ్మాళి మండల కేంద్రాల్లోని హుద్‌హుద్ ఇళ్లను శనివారం పరిశీలించారు. ఇప్పటి వరకూ ఈ ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించకపోవడంతో ముళ్లపొదలు పెరిగాయని, చెదలు పట్టాయని చెప్పారు. వ్యవసాయశాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాల మేరకు మరమ్మతులు చేసి లబ్ధిదారులకు అందజేయాలని నిర్ణయించామన్నారు. తక్షణమే మరమ్మతులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా గృహనిర్మాణశాఖ పీడీ బి.నగేష్‌ను ఆదేశించారు. ఎస్‌ఈ నాగభూషణరావు, ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్ ఉన్నారు.

పాడి పంటలను ప్రోత్సహించాలి


సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

పలాస: పాడిపంటలను ప్రోత్సహించాలని, అందుకు రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పెద్దనీలావతి గ్రామంలో లేగదూడల ప్రదర్శన, గర్భకోశ వ్యాధులకు చికిత్స శిబిరాన్ని పశువైద్య శాఖ అధికారులు శనివారం నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన ఆమె మాట్లాడుతూ.. రైతులకు పాడి అనేది లాభసాటి పరిశ్రమంగా ఉండాలని అన్నారు. అందుకు ఆ శాఖ అధికారులు, ఉద్యోగులు ఎప్పటికప్పుడు మంచి సలహాలు సూచనలు ఇస్తూ పాడి అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ ఆర్.మురళీధర్, డిప్యూటీ డైరెక్టర్ సత్యప్రకాష్, డాక్టర్లు వి.జయరాజు, ఎం.రవిక్రిష్ణ, పి.చంద్రశేఖర్, ఆర్.రాజకిరణ్, కె.మధుబాబు, జిల్లా గ్రంథాలయసంస్థ మాజీ చైర్మన్ పీరుకట్ల విఠల్‌రావు, పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉల్లాసంగా స్కూల్ గేమ్స్ పోటీలు

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో శనివారం నిర్వహించిన మండలస్థాయి బ్యాడ్మింటన్, యోగా పోటీలు ఉల్లాసంగా జరిగాయి. మండల విద్యా శాఖాధికారులు డి.తులసీరెడ్డి, డి.చిన్నారావు పోటీలను ప్రారంభించారు. అండర్ –14, 17 విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో మండలం పరిధిలో వివిధ పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. నియోజకవర్గ స్థాయి క్రీడల ఇన్‌చార్జి బి.నారాయణరావు, మండల ఇన్‌చార్జి కె.కె.రామిరెడ్డి, పీఈటీలు ఆదిశేషు, లక్ష్మణరావు, వెంకటరమణ, శ్యామలరావు పాల్గొన్నారు.

యువకుల శ్రమదానం

సోంపేట: గొల్లగండి పంచాయతీ పరిధి చేపల గొల్లగండి గ్రామంలో విజేత యువజన సేవ సంఘం ఆధ్వర్యంలో శనివారం శ్రమదానం చేశారు. రోడ్లకు ఇరువైపులా పేరుకుపోయిన పిచ్చిమొక్కలను తొలగించారు సంఘ సభ్యుల తోపాటు విద్యార్థులు భాగస్వాములయ్యారు.

ముగిసిన ఏడు శనివారాల ఉజ్జాపన దీక్షలు


పూజల్లో పాల్గొన్న భక్తులు

కవిటి: లొల్లపుట్టుగలోని కల్యాణ వేంకటేశ్వర ఆలయంలో శ్రావణమాసం తొలి శనివారం నుంచి ప్రారంభించిన ఏడు శనివారాల వ్రతాల ఉజ్జాపన దీక్షలు శనివారంతో ముగిశాయి. ప్రధానార్చకులు అప్పలస్వామి, వెంకటరమణ స్వామిల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

ఇసకలపాలెం తీరలో స్వచ్ఛత కార్యక్రమం

సోంపేట: ఇసకలపాలెం గ్రామ సముద్ర తీరంలో స్థానిక సిద్ధి వినాయక యువజన సంఘం ఆధ్వర్యంలో స్వచ్ఛ సాగర్–సురక్షిత సాగర్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. గ్రామస్తులు, స్థానిక ప్రాథమిక, జెడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, చేయూత ఫౌండర్ నరసయ్య, సిద్ధి వినాయక పూజా కమిటీ సభ్యులు తీరంలోని ప్లాస్టిక్, చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించారు. స్థానిక నేతలు బైపల్లి ఈశ్వరరావు, బైపల్లి తిరుపతి పాల్గొన్నారు.

గణితంపై భయాన్ని వీడాలి


గణితావధానం చేస్తున్న తిరుపతి

ఇచ్ఛాపురం: విద్యార్థులు గణితంపై భయాన్ని వీడితేనే మంచి ఫలితాలను సాధించగలరని గణితావధాని మద్దు తిరుపతిరావు అన్నారు. పట్టణంలోని శాంతినికేతన్ పాఠశాల ఆవరణలో శనివారం గణితావధానం కార్యక్రమాన్ని పాఠశాల డైరెక్టర్ దక్కత కృష్ణమూర్తి రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సిబ్బంది సురేష్, కేసిపూరి, లోలాక్షి, రవికుమార్, తనూజ్ ఉన్నారు.

లైన్‌మెన్ కుటుంబానికి ఆర్థికసాయం

టెక్కలి రూరల్: టెక్కలి పంచాయతీలో విద్యుత్ లైన్‌మెన్‌గా పనిచేస్తూ స్తంభం పైనుంచి జారిపడి మృతి చెందిన బొమ్మాళి బాలరాజు కుటుంబానికి ఎలక్ట్రికల్, ప్లంబింగ్ వర్కర్స్ యూనియన్ అండగా నిలిచింది. పదివేల రూపాయలను సేకరించింది. ఈ మొత్తాన్ని గొల్లశీతాపురం గ్రామంలో ఉన్న బాలరాజు కుటుంబ సభ్యులకు శనివారం అందజేశారు. అలాగే టెక్కలి పెద్ద బ్రాహ్మణవీధికి చెందిన ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ ప్రసాద్ ప్రమాదానో విద్యుత్ పనులు చేస్తుండగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం అతనికి రూ.5 వేలు ఆర్థికసాయం చేసినట్లు యూనియన్ సభ్యులు తెలిపారు. యూనియన్ అధ్యక్షులు నర్శిపురం మౌళి, ఆర్.ఈశ్వరరావు, హెచ్.నాయుడు, డి.ఈశ్వరరావు, వినోద్ కుమార్ ఉన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం

ఇచ్ఛాపురం రూరల్: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ అన్నారు. ఈదుపురం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం నిర్వహించిన పోషకాహార మాసోత్సవాలు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. చిరు ధాన్యాలు, పోషక విలువల గల ఆహార పదార్థాలు, లాభాలను గర్భిణులు, బాలింతలకు వివరించారు. పౌష్టికాహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దువ్వు వివేకానందరెడ్డి, సర్పంచ్ నర్తు వరప్రసాదరావు, నర్తు ఢిల్లీరావు, జుత్తు గణేష్, అంగన్‌వాడీ కార్యకర్తలు జయ, సుందరి, విమల, పార్వతి పాల్గొన్నారు.

పౌష్టికాహారం ప్రదర్శన

నందిగాం: గర్భిణులు, బాలింతలు తీసుకునే పౌష్టికాహారంతోనే ఆరోగ్యవంతంగా ఉంటారని ఐసీడీఎస్ పీఓ శోభారాణి అన్నారు. మొండ్రాయివలసలో పౌష్టికాహార మాసోత్సవాన్ని శనివారం నిర్వహించారు. పౌష్టిక విలువలు ఉన్న ఆహార పదార్థాలు, పోషక విలువలు తెలియజేసే గోడపత్రికలను అంగన్‌వాడీ సిబ్బంది ప్రదర్శించారు. ఈ ప్రదర్శనను రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు తిలకించారు. ఏసీడీపీఓ ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

రెవెన్యూ సేవల్లో తీవ్ర జాప్యం!

- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న ప్రజలు

కంచిలి: మండల పరిధిలో రెవెన్యూ సేవల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. పట్టాదారు పాసు పుస్తకాలు, అడంగల్ సమస్యలు, విద్యార్థులకు అవసరమైన కుల, నేటివిటీ తదితర సర్టిఫికెట్లను జారీ చేయడంలో జాప్యం జరుగుతుండడంతో పలువురు అవస్థలు పడుతున్నారు. మండలవ్యాప్తంగా ఉన్న సచివాలయాల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసి నెలలు గడిచినా చాలా వరకు పనులు ముందుకు సాగటం లేదని పలువురు వాపోతున్నారు. కొన్ని నెలలుగా ఇక్కడ ఇదే సమస్యతో మండల ప్రజలు ఎటువంటి పనులు జరగక తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీనికి కొత్తగా వచ్చిన తహసీల్దార్‌కు, మిగతా అధికారులు, సిబ్బందికి మధ్య సమన్వయలోపమే కారణంగా చెబుతున్నారు. కిందిస్థాయి అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది ధ్రువీకరిస్తున్న దరఖాస్తులపై తహసీల్దార్‌కు నమ్మకం లేకపోవడం, సంబంధిత దరఖాస్తుల్లో పొందుపరిచిన వివరాలపై ఏమాత్రం అనుమానం కలిగినా సంబంధిత పనులు ముందుకు సాగడం లేదని తెలుస్తోంది. ఇటీవల పలువురు విద్యార్థులు వారికి అవసరమైన కుల, నేటివిటీ సర్టిఫికెట్ల కోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. సచివాలయంలో ఆన్‌లైన్లో దరఖాస్తు చేసినప్పటికీ, మళ్లీ ఒక కాపీని మండల రెవెన్యూ కార్యాలయానికి తీసుకొచ్చి స్వయంగా తహసీల్దార్‌కు ఇచ్చి, అన్ని అనుమానాలు నివృత్తి చేస్తేనే సర్టిఫికెట్లు ఇస్తున్నారని, వివరాలపై ఏమాత్రం సంతృప్తి చెందకపోయినా ఆ పని ఆగిపోవడం ఖాయంగా కన్పిస్తోంది. జాడుపూడి సచివాలయంలో బండారు నరేంద్ర, పిలక సందీప్‌లు ఆగస్టు 21న ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశారు. సంబంధిత దరఖాస్తులను మళ్లీ తన దగ్గరకు తీసుకొస్తేనే సర్టిఫికెట్లు జారీ చేస్తానని తహసీల్దార్ కార్యాలయం వారు చెప్పారని, సచివాలయానికి ఇచ్చిన వాటిని తిరిగి ఎలా తీసుకొస్తామని దరఖాస్తుదారులు వాపోతున్నారు. ఇలా పలువురు ఇక్కడ తహసీల్దార్ కార్యాలయం పనితీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నప్పటికీ ఏమాత్రం ఖాతరు చేయకుండా వారి పంథాలో వారు ముందుకు పోతుండటం విస్మయం కల్గిస్తోంది.

తహసీల్దార్ ఏమన్నారంటే..

రెవెన్యూ సేవల్లో జరుగుతున్న తీవ్ర జాప్యంపై తహసీల్దార్ వై.జయలక్ష్మి వద్ద ప్రస్తావించగా.. కిందిస్థాయి సిబ్బంది సరిగ్గా విచారించకుండా కౌంటర్ సంతకాలు చేస్తున్నారన్నారు. తాను మళ్లీ విచారించి సర్టిఫికెట్లు ఇస్తుండడంతో జాప్యం జరుగుతోందని చెప్పారు. భవిష్యత్తులో ఎటువంటి వివాదాల్లో ఇరుక్కోకుండా తగిన జాగ్రత్తలు తీసుకొని విధులు నిర్వర్తిస్తున్నట్లు చెప్పారు.

ఏవీఎస్ స్టేట్ కౌన్సిల్ సభ్యుడుగా సాయిసందీప్‌రెడ్డి


సాయిసందీప్‌రెడ్డి

కాశీబుగ్గ: ఆంధ్ర విద్యార్థి సంఘం (ఏవీఎస్) స్టేట్ కౌన్సిల్‌గా సభ్యుడుగా గిన్ని సాయిసందీప్‌రెడ్డి నియమితులయ్యారు. పలాసకు చెందిన ఈయనను ఈనెల 19న నెల్లూరులో జరిగిన రాష్ట్రస్థాయి సమావేశంలో నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు మల్లవరపు అశోక్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

మృతుల కుటుంబాలకు తిలక్ పరామర్శ


పెంటూరులో సీతారాం కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న తిలక్

నందిగాం: పెంటూరు గ్రామానికి చెందిన అట్టాడ సీతారాం తల్లి రమణమ్మ ఇటీవల మృతి చెందారు. దీంతో సీతారాం కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ శనివారం పరామర్శించారు. అలాగే సంతబొమ్మాళి మండలం పాతనౌపడకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు దల్లి లోకేష్‌రెడ్డి తల్లి అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆమెను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని కుటుంబసభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, చిన్ని జోగారావు, కణితి నారాయణమూర్తి, సనపల రమేష్, ఆట్ల రాహుల్, హనుమంతు వెంకటేశ్వరరావు, గుజ్జుమోహన్ రెడ్డి, ఆర్.మురళీరెడ్డి, పోలాకి మోహనరావు, పొందర శ్రీను, సుగ్గు అప్పలరెడ్డి ఉన్నారు.

కోటబొమ్మాళి: చీపుర్లపాడు సర్పంచ్ నేతింటి అప్పలస్వామి తండ్రి గోపాలరావు ఇటీవల మరణించారు. దీంతో అప్పలస్వామి కుటుంబ సభ్యులు పేరాడ తిలక్ పరామర్శించి సంతాపాన్ని తెలియజేశారు. కోటబొమ్మాళి జెడ్పీటీసీ సభ్యుడు దుబ్బ వెంకటరమణారావు, సర్పంచ్ కాళ్ల సంజీవరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నెపు రామారావు, రోణంకి మల్లయ్య, నూక సత్యరాజ్, మెట్టింహాచలం ఉన్నారు.

శాంతిమార్గాన్ని ఎంచుకోవాలి

కాశీబుగ్గ: ప్రపంచ శాంతిని ఆకాంక్షించే దేశాల్లో భారతదేశం ప్రథమ స్థానంలో ఉంటుందని పలాస–కాశీబుగ్గ లయన్స్ క్లబ్ అధ్యక్షులు హనుమంతు ఎండుదొర అన్నారు. అందరూ శాంతిమార్గాన్ని ఎంచుకోవాలన్నారు. ప్రపంచశాంతి దినోత్సవాన్ని స్థానిక విద్యావాహిని కళాశాలలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి అంతర్జాతీయ శాంతి దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. లయన్స్ క్లబ్ కార్యదర్శి తమ్మినాన మాధవరావు, కోశాధికారి ఎస్.అప్పారావు, ప్రిన్సిపాల్ పైల తిరుమలరావు, ప్రతినిధులు కొర్రాయి బాలకృష్ణయాదవ్ ఉన్నారు.

ఘనంగా అనందరావు జన్మదిన వేడుకలు


ఆనందరావుకు కేక్ తినిపిస్తున్న అభిమానులు

కాశీబుగ్గ: పలాసకు చెందిన స్నేహా జ్యూయలర్స్, చిట్ ఫండ్ ఫైనాన్స్, రియల్ ఎస్టేట్ ప్రొప్రైటర్ బల్ల ఆనందరావు జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. తన వ్యాపార సముదాయంలో జరిగిన వేడుకలలో ప్రముఖులు, అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేసి సందడిగా గడిపారు. పలాస, కాశీబుగ్గ జంట పట్టణాలకు చెందిన నాయకులు, స్నేహితులు, బంధువులు, వ్యాపారులు శుభాకాంక్షలు తెలియజేశారు.

వరదబాధితులకు లయన్స్‌క్లబ్ వితరణ

కాశీబుగ్గ: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు కాశీబుగ్గ మున్సిపాలిటీకి చెందిన లయన్స్‌క్లబ్ సభ్యులు రూ.80 వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని సీఎంఆర్‌ఎఫ్‌కు చేరవేయాలని కోరుతూ పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషకు సంబంధిత చెక్కును శనివారం అందజేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు హెచ్‌వై దొర, సభ్యులు తమ్మినాన మాధవరావు, కొర్రాయి బాలకృష్ణ, వజ్జ బాబూరావు, నెమలిపురి అప్పారావు, సాసుమాను చంద్రమౌళి ఉన్నారు.

మార్గమధ్యలోనే ప్రసవం


తల్లీబిడ్డతో 108 వాహన సిబ్బంది

కాశీబుగ్గ: మెళియాపుట్టి మండలం సంతోషపురం గ్రామానికి చెందిన గర్భిణి సవర యశోదకు శనివారం పురిటినొప్పులు రావడంతో పలాస 108 వాహన సిబ్బందికి కుటుంబ సభ్యులు సమాచారం అందించారు. దీంతో సిబ్బంది వాహనంతో గ్రామానికి చేరుకొని యశోదను ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలో ముక్తాపురం సమీపంలో నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో డాక్టర్ కుమార్‌రాజా సలహాతో సిబ్బంది ప్రసవం చేయించారు. పండంటి మగ బిడ్డకు యశోద జన్మనిచ్చింది. తల్లీబిడ్డకు 108 వాహన ఈఎంటీ పాశాల సత్యం, పైలెట్ కెల్లి శ్రీనివాసరావు ప్రథమ చికిత్స అందించిన తరువాత ఖరజాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేర్పించారు.

క్రీడా స్ఫూర్తితోనే విజయాలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

వజ్రపుకొత్తూరు: క్రీడా స్ఫూర్తి ప్రదర్శించడం ద్వారానే విజయాలు సాధించవచ్చునని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. గోవిందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం కె. హరిబాబు అధ్యక్షతన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి అథ్లెటిక్స్, యోగా అండర్–14, 17 విభాగాల్లో బాల బాలికలకు ఎంపిక పోటీలు శనివారం జరిగాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గం వ్యాప్తంగా వచ్చిన క్రీడాకారులు స్నేహభావంతో మెలిగి క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని అన్నారు. ఈ సందర్భంగా జాతీయ, గ్రిగ్స్, పాఠశాల పతాకాలను ఎగుర వేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు, మాజీ ఎంపీపీ జి.వసంతరావు, గోవిదపురం పీహెచ్‌సీ మాజీ చైర్మన్ పి.ఈశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి కర్ని రమణ, ఉపాధ్యక్షుడు ఎ.ఉమామహేశ్వరరావు, బీసీ సెల్ అధ్యక్షుడు గోవింద పాపారావు, కొల్లి రమేష్ పాల్గొన్నారు.

గురజాడకు ఘనంగా నివాళి


టెక్కలి: గురజాడ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రంథాలయాధికారి, పాఠకులు


కవిటి: గురజాడ చిత్రపటానికి పూలమాల వేస్తున్న హెచ్ఎం మల్లేశ్వరరావు


నందిగాం: గురజాడ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పెద్దతామరాపల్లి ఉపాధ్యాయులు

టెక్కలి : అభ్యుదయ కవితా పితామహుడు గురజాడ అప్పారావు అని స్థానిక శాఖా గ్రంథాలయాధికారి బి.రూపాదేవి అన్నారు. గురజాడ జయంతి సందర్భంగా శనివారం శాఖా గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గురజాడ రచనలను వివరించారు.

కవిటి: తెలుగు భాషకు వెలుగు జాడ గురజాడ అప్పారావు అని కవిటి ప్రభుత్వ ఉన్నతపాఠశాల హెచ్ఎం బెందాళం మల్లేశ్వరరావు అన్నారు. గురజాడ జయంతి సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిబ్బందితో కలిసి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. తెలుగు భాషా వైభవానికి ఎనలేని సేవలందించిన గురజాడ మార్గం నేటి తెలుగు భాషా ఉపాధ్యాయులకు నిత్య అనుసరణీయమని హెచ్ఎం అన్నారు.

నందిగాం: పెద్దతామరాపల్లి పాఠశాలలో గురజాడ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు కె.గున్నయ్య ఆధ్వర్యంలో అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గురజాడ రాసిన దేశమును ప్రేమించుమన్న, మంచి యన్నది పెంచుమన్న గీతాన్ని విద్యార్థులంతా ఆలపించారు. అనంతరం ఆయన చేసిన సాంఘీక సేవలను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయులు బాలక శంకరరావు, వనిత, కుమారి పాల్గొన్నారు.